క్లుప్తంగా

'సీఎం జగన్‌కు ఆజన్మాంతం రుణపడి ఉంటాం'

కదిరి అర్బన్: ఆరుగురు ముఖ్యమంత్రులు పరిష్కరించలేని తమ సమస్యను మనసున్న మారాజులా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరిష్కరించడంతో డీఎస్సీ-1998 క్వాలిఫైడ్ టీచర్స్ అసోసియేషన్ సభ్యుడు నాగరాజు బుధవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. 4,534 మందికి పోస్టింగ్‌లు ఇచ్చి తమ జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రికి ఆజన్మాంతం రుణపడి ఉంటామని పేర్కొన్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

18న వేలం పాట

కనగానపల్లి(రామగిరి): రామగిరి మండలంలోని నసనకోట ముత్యాలమ్మ ఆలయం వద్ద ఉన్న అద్దె గదులు, వ్యాపార సముదాయాల నిర్వహణకు ఈనెల 18, 20 తేదీల్లో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ బీఆర్ వెంకటేసులు ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రకాల అద్దె గదులు, ఐస్‌క్రీం విక్రయాల కోసం వేలం పాటలో పాల్గొనాలనుకునే వారు రూ.20 వేల డిపాజిట్ చెల్లించాలన్నారు. అలాగే టెంకాయలు, పూజా సామగ్రి, హోటళ్లు, కిరణా కొట్లు, ఫొటో విక్రయాలు, సప్లయర్స్ సామాన్లు బాడుగ నిర్వహణ కోసం రూ.1000 చొప్పున డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చని చెప్పారు.

జానపద ఉత్సవాల్లో సత్తా


ప్రథమ బహుమతి పొందిన చిన్నారులు

కదిరి అర్బన్: హైదరాబాదులోని రవీంద్రభారతిలో తెలంగాణా ప్రభుత్వం, నటరాజ్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 14న జరిగిన సకల కళా సమ్మేళన జానపద ఉత్సవాల్లో కదిరికి చెందిన అశ్విని, పృథ్విరాజ్‌ల కుమార్తె అవంతిక, వీణ, లక్ష్మీపతి దంపతుల కుమార్తె నేహప్రియ సత్తా చాటారు. ప్రథమ బహుమతి సాధించారు. కదిరికి చెందిన మయూరి నాట్య అకాడమీలో వీరు శిక్షణ పొందారు. ప్రథమ బహుమతి పొందిన చిన్నారులను రోటరీక్లబ్ ప్రెసిడెంట్ రంజిత్‌తో పాటు సభ్యులు అభినందనలు తెలిపారు.

ప్రమాద బీమాతో మేలు

బత్తలపల్లి: బ్యాంకుల్లో ఖాతాదారులు ప్రమాద బీమా ప్రీమియం చెల్లిస్తే ఎంతో మేలు జరుగుతుందని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు బత్తలపల్లి శాఖ మేనేజర్ భద్రీనాథ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో మండలంలోని గంటాపురం గ్రామానికి చెందిన కల్లె ఎర్రమ్మ భర్త శ్రీరాములుకు రూ.2 లక్షల చెక్కును పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కల్లె ఎర్రమ్మ తమ బ్యాంకులో ఖతాదారు కావడంతో పీఎంజేజేబీవై కింద ప్రమాద బీమా ప్రీమియం చెల్లించిందన్నారు. ఆమె గత ఏడాది సెప్టెంబర్ 9న అనారోగ్యంతో మృతి చెందడంతో ఆమె భర్తకు రూ.2 లక్షల చెక్కును అందజేస్తున్నట్లు తెలిపారు. ఖతాదారులు, రైతులు బ్యాంకు సేవలను వినియోగించుకొని ఆనందంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ లోకేష్, లక్ష్మీదేవి, హిమజ, జ్యోతి, కాశీ, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు

పుట్టపర్తి: మండలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి సూచించారు. బుధవారం బుక్కపట్నం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆదినారాయణ, అగ్రీ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

17న చలో కలెక్టరేట్


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

పుట్టపర్తి టౌన్: మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 17న చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపడుతున్నట్లు మున్సిపల్ వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మినారాయణ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలో మున్సిపల్ కార్యాలయం ముందు కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య, ఇంజినీరింగ్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. డిమాండ్ల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న కార్యక్రమానికి కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి గౌస్‌లాజమ్, యూనియన్ నాయకులు గోవిందు, పెద్దన్న, నాగార్జున, రామయ్య, రమణ, రమేష్, గణేష్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు 'సాంకేతిక' సాయం

- కదిరిలో ప్రారంభానికి సిద్ధంగా అగ్రి లేబొరేటరీ
- రూ. 50 లక్షలతో ఏర్పాటు
- అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అన్ని రకాల పరీక్షలు
- రైతన్నలకు తప్పనున్న నకిలీల బెడద


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న అగ్రి లేబొరేటరీ

కదిరి అర్బన్: నియోజకవర్గంలోని రైతులకు నకిలీ పురుగుల మందులు, విత్తనాలు, ఎరువులు బెడద ఇక తగ్గనుంది. ఇందుకు ప్రభుత్వం రూ. 50 లక్షల నిధులతో స్థానిక వెలుగు కార్యాలయ ఆవరణంలో నియోజకవర్గ డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ లేబోరేటరీని నిర్మించింది. కార్పొరేట్ కార్యాలయం తరహాలో అన్ని హంగులతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భవనాన్ని నిర్మించారు. ల్యాబ్ ద్వారా నియోజకవర్గంలో 6 మండలాల రైతాంగానికి సేవలు అందనున్నాయి.

అగ్రిల్యాబ్ ప్రయోజనాలు ఇలా..

గతంలో నకిలీ పురుగుల మందులు, ఎరువులు, విత్తనాలతో నియోజకవర్గంలోని రైతులు పంటలు నష్టపోయారు. పట్నం, ఎన్పీకుంట, తనకల్లు మండలాల్లో ఎక్కువగా నకిలీ విత్తనాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇలా రైతులు నకిలీ దెబ్బకు నష్టపోకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వమే రైతులకు నాణ్యమైన విత్తనాలు, పురుగులు మందులు, ఎరువులు సరఫరా చేయాలని నిర్ణయించారు. ఇందుకుగాను నియోజకవర్గానికి ఒక అగ్రిల్యాబ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. తొలుత ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలకు అగ్రిల్యాబ్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. దీంతో పాటు పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు కూడా కూడా నిర్వహిస్తారు. పశువులకు వచ్చే వ్యాధులకు సంబంధించి రక్త నమూనాలు తీసుకుని పరీక్షిస్తారు.



విత్తన మొలక శాతాన్ని పరీక్షించే యంత్రం (సీడ్ జెర్మినేటర్)

సంతోషంగా ఉంది



సాగులో ఏదశలో కూడా రైతు నష్టపోకూడదని అగ్రి లేబొరేటరీలు ఏర్పాటు చేస్తుండడం సంతోషంగా ఉంది. విత్తనం దగ్గర నుంచి పంట చేతికి వచ్చేవరకు అన్ని దశల్లోను రైతుకు వెన్నుదన్నుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిలుస్తున్నారు. నాణ్యమైన విత్తనాలు, పురుగుల మందులు, ఎరువులు వాడితే పంట దిగుబడి బాగుంటుంది.

\- రామాంజి, రైతు, పట్నం

నకిలీలకు చెక్



వైఎస్సార్ అగ్రి లేబొరేటరీ రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. నకిలీ పురుగుల మందులు, విత్తనాలు, ఎరువులకు పరీక్షలు నిర్వహించి చెక్ పెట్టచ్చు. ఇందులో నేను, వ్యవసాయాధికారి ఒకరు, ఏఈఓలు ఇద్దరు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌తో పాటు 6 మంది సిబ్బంది ఉంటారు. నియోజకవర్గానికి ఒక ల్యాబ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది.

\- సత్యనారాయణ, ఏడీఏ, కదిరి

సంక్షేమ రథసారథిని మరోసారి ఆశీర్వదించండి


సమస్యలను తెలుసుకుంటున్న వెంకటకృష్ణారెడ్డి

బత్తలపల్లి: సంక్షేమ రథసారథి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి కోరారు. బుధవారం మండలంలోని యర్రాయపల్లిలో రైతు విభాగం రాష్ట్ర కార్యవర్గసభ్యులు కమతం ఈశ్వరయ్య, సర్పంచు కమతం వరలక్ష్మీ ఆధ్వర్యంలో గుడ్ మార్నింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని వివరిస్తూ బ్రోచర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా అర్హత ఉన్నవారందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సచివాలయాల కన్వీనర్ జయరామిరెడ్డి, ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డి, నాయకులు బండి వీరనారప్ప, సంజీవు, రాంభూపాల్‌రెడ్డి, కమతం సంగాలప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు


ధర్మవరంలో పరీక్షా కేంద్రం వద్ద గుమికూడిన విద్యార్థులు


హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న దృశ్యం

కదిరి అర్బన్: కదిరి పట్టణంలో ఇంటర్ పరీక్షలు తొలిరోజు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. కదిరి పట్టణం, రూరల్ మండలంలో మొత్తం 4 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. ఈ నాలుగు సెంటర్లలో మొత్తం 1,236 మంది విద్యార్థులకు గాను 1,176 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 63 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు.

తనకల్లు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న 230 మంది విద్యార్థులు తెలుగు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 223 మంది పరీక్షకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ ప్రశాంత్ తెలిపారు. ఏడు మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాన్ని పరీక్షల ప్రత్యేకాధికారి ప్రసాద్ పరిశీలించారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ బాబాఫకృద్దీన్ పాల్గొన్నారు.

నలుగురు గైర్హాజరు

నల్లమాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. 124 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా నలుగురు గైర్హాజరైనట్లు డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ ప్రకాష్‌నాయుడు, పరీక్షల చీఫ్ కే. కవిత తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్‌తో పాటు స్పెషలాఫీసర్ గంగప్ప తనిఖీ చేశారు.

అమడగూరు: మండలంలోని శీతిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన తెలుగు, హిందీ పరీక్షలకు మొత్తం 87 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 84 మంది పరీక్షలను రాసినట్లు డిపార్ట్‌మెంటల్ అధికారి వెంకటరమణ, చీఫ్ సూపరింటెండెంట్ ప్రభాకర్ పేర్కొన్నారు. ఎస్‌ఐ వెంకటనారాయణ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

పరీక్షలకు 97.4 శాతం హాజరు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలకు 97.4 శాతం హాజరు అయినట్లు డీవీఈఓ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఏపీ మోడల్ కళాశాల, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, వాసవి జూనియర్ కళాశాల, సీతారామయ్య జూనియర్ కళాశాలల్లో బుధవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీవీఈఓ రఘునాథ్‌రెడ్డి ఏపీ మోడల్ కళాశాల, ప్రభుత్వ బాలుర కళాశాల, వాసవి కళాశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లోని గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు తాగునీరు, వెలుతురు, ఫ్యాన్లు ఉన్నాయా, లేదా అన్నవి పరిశీలించారు. విద్యార్థులను పరీక్షా సమయంలోనే అనుమతించాలని ఆలస్యంగా వస్తే అనుమతించరాదని సంబంధిత చీఫ్ సూపరింటెండెంట్‌లను ఆదేశించారు. పరీక్షా గదులలో సీసీ కెమెరా ఏర్పాట్లను చూస్తూ ఇన్విజిలేటర్లు కూడా ఎటువంటి సెల్‌ఫోన్లు కూడా తీసుకురారాదని సూచించారు. పట్టణంలోని ఐదు పరీక్ష కేంద్రాలలో మొత్తం 1,304 మంది విద్యార్థులు ఉండగా 1,270 మంది హాజరుకాగా 34 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో వన్‌టౌన్ సీఐ సుబ్రమణ్యం పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షా సమయంలో జిరాక్స్ సెంటర్లు తెరవకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

తాడిమర్రి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ మీడియట్ పరీక్షలు ప్రారంభం అయ్యాయి. చీఫ్ సూపరింటెండెంట్ డి.మధుసూదన్‌రెడ్డి పర్యవేక్షణలో డిపార్ట్‌మెంట్ అధికారి బి.షెక్షావలి పరీక్షలను సజావుగా నిర్వహించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం విద్యార్థులు తెలుగు పరీక్ష రాశారు. జిల్లా వృత్తి విద్యాధికారి రఘునాథ్‌రెడ్డి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. కళాశాల విద్యార్థులు 25 మంది, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం విద్యార్థినులు 21 మంది మొత్తం 26 మంది పరీక్షకు హాజరు కావలసి ఉండగా ఇద్దరు గైర్హాజరు అయినట్లు అధికారులు ఆయనకు తెలిపారు. మాస్ కాపీయింగ్ జరక్కుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. విద్యార్థుల కోసం తాగునీరు, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలసిన ఎమ్మెల్యే



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి బుధవారం కలిశారు. అసెంబ్లీ సమావేశం ముగిసిన తర్వాత మర్యాద పూర్వకంగా సీఎంని కలిసి మాట్లాడారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు.

\- పుట్టపర్తి:

మండల సమాఖ్యలతో మహిళాభ్యున్నతి

- డీఆర్‌డీఏ పీడీ నరసయ్య


పీడీ నరసయ్య చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఏపీఎం శివమ్మ

పుట్టపర్తి అర్బన్: మండల సమాఖ్యల ద్వారా ప్రభుత్వం మహిళల అభివృద్ధికి పాటుపడుతోందని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పేర్కొన్నారు. బుధవారం పుట్టపర్తి మండల సమాఖ్యలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏపీఎం శివమ్మను జిల్లా ఉత్తమ మహిళా ఉద్యోగిగా గుర్తించి అవార్డు అందజేశారు. ఘనంగా సన్మానించారు. అనంతరం పీడీ నరసయ్య మాట్లాడుతూ మండల సమాఖ్యల ద్వారా ప్రతి మహిళను లక్షాధికారిని చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతి పథకాన్ని మహిళల పేరుపైనే ఇస్తూ కుటుంబ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. సమాఖ్యల ద్వారా తీసుకునే రుణాల కంతులను చక్కగా చెల్లించేలా మహిళలకు అవగాహన పెంచడంలో ఏపీఎం శివమ్మ కీలక పాత్ర పోషించడంతో ప్రభుత్వం అవార్డు అందజేసిందన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు దుద్దుకుంట పుష్పలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరాణి, ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ ఉషారాణి, మాజీ అధ్యక్షురాలు కన్యాకుమారి, ఉపాధ్యక్షురాలు శివమ్మ,సీసీలు రమణప్ప, నాగమణి గ్రామ సంఘం అధ్యక్షులు, అనిమేటర్లు ,సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ ఉండాలి

తలుపుల: మహిళలకు అన్ని రంగాల్లో సముచిత స్థానంతో పాటు ఆర్థిక స్వేచ్ఛ ఉండాలని ఎంపీడీఓ రామానాయక్ అన్నారు. స్థానిక వైకేపీ కార్యాలయంలో బుధవారం ఏపీఎం బాబ్జి, మహిళా సమైఖ్య అధ్యక్షురాలు గౌషియా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇంటికి ఇల్లాలే దీపం అన్నట్లు ప్రతి మహిళకు విద్యతో పాటు ఆర్థిక స్వేచ్ఛ ఉన్నప్పుడే ఆ కుటుంబం రాణిస్తుందన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శకుంతల, మహిళా సంఘం సభ్యులు శశికళ పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

నల్లచెరువు: స్థానిక వెలుగు కార్యాలయంలో శ్రీ ఆంజనేయస్వామి మండల సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలలోని వివిధ సంఘాల మహిళా సభ్యులు హాజరయ్యారు. ఏపీజీబీ బ్యాంకు మేనేజర్ ప్రభావతి, ఏపీఎంలు రమణమ్మ, రమణప్ప, ఎల్సీ మునెప్ప, సీసీ హనుమంతు, ప్రవీన్,కదిరప్ప, వీఓఏ, వీఓ లీడర్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న జగన్మోహన్‌రెడ్డి

నల్లమాడ: జిల్లా, మండల స్థాయిల్లో ఫిర్యాదుల దినోత్సవంలో ప్రజల నుంచి వచ్చే సమస్యల పరిష్కారానికి అధికారులతో కలిసి తనవంతు కృషి చేస్తానని గ్రీవెన్స్ సెల్ పుట్టపర్తి జిల్లా అధ్యక్షుడు ముక్తాపురం జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన జగన్మోహన్‌రెడ్డిని బుధవారం స్థానిక పాత బాలాజీ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల ఆవరణలో వైఎస్సార్ సీపీ నాయకులు దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ హయాంలో రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొని కరువు విలతాండవం చేయడంతో రైతులు, కూలీలు పక్క రాష్ట్రాలకు వలసలు వెళ్లారన్నారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి పీఠం అధిష్టించినప్పటి నుంచి నాలుగేళ్లుగా వర్షాలు సమృద్ధిగా కురుస్తూ సాగు, తాగునీటికి ఎలాంటి కొరత లేకుందన్నారు. రాజు బాగుంటే రాజ్యం బాగుంటుందనడానికి ఇదొక నిదర్శనమన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలోని 193 చెరువులను కృష్ణా జలాలతో నింపి ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా తనను ఎంపిక చేసిన ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి, సహకరించిన నాయకులు, కార్యకర్తలకు మోహన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కుళ్లాయినాయక్, సచివాలయ మండల కన్వీనర్ ఏ.గంగిరెడ్డి, నాయకులు రఘునాథరెడ్డి, దేశాయి కాళిదాస్‌రెడ్డి, కోనపల్లి భాస్కర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, షంషీర్, డీలర్లు లక్ష్మినారాయణ, నారాయణస్వామి, ప్రతాప్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీ యూనియన్ అధ్యక్షుడి హఠాన్మరణం

బత్తలపల్లి: మండల ఏఐటీయూసీ అనుబంధ విభాగం లక్ష్మీనరసింహ హమాలీవర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ మండల కార్మిక సంఘం మాజీ అధ్యక్షుడు మండల క్రిష్టప్ప(55) బుధవారం హఠాన్మరణం చెందారు. మంగళవారం రాత్రి ఆయన స్వగృహంలో అస్వస్థతకు గురికాగా వెంటనే ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి జింకా చలపతి, హమాలి యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వీకే కృష్ణుడు, హమాలి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి సభ్యులు నారాయణ, జిల్లా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బయన్న, రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కుళ్లాయప్ప, తదితరులు మృతదేహానికి బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నివాళి



పుట్టపర్తి: బుక్కపట్నం చెరువు కట్టపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మంగళవారం గురివిరెడ్డి కొట్టాలకు చెందిన సుదర్శన్‌రెడ్డి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బుధవారం వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దుద్దుకుంట వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, యూత్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి తదితరులు కొట్టాలలో సుదర్శన్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం తరఫున అందాల్సిన ప్రయోజనాలను త్వరగా ఇప్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

సచివాలయం తనిఖీ

గాండ్లపెంట: మండల పరిధిలోని వేపరాల గ్రామ సచివాలయాన్ని ఎంపీపీ తాతం జగన్మోహన్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరును పరిశీలించారు. సచివాలయ సిబ్బంది ప్రజల నుంచి వచ్చే వినతులను స్వీకరించి గడువులోగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ వలంటీర్లు సైతం వారంలో మూడు రోజులు విధిగా గ్రామ సచివాలయానికి హాజరు కావాలన్నారు. ఎంపీపీ వెంట మండల పరిషత్ సీనియర్ సహాయకులు అమీర్‌బాషా ఉన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

గాండ్లపెంట: మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ అంజినప్ప తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో కూలీల సంఖ్య చాలా తక్కువగా ఉందని క్షేత్ర, సాంకేతిక సహాయకులు గ్రామాల్లో పనులపై అవగాహన కల్పించాలని సూచించారు. పండ్ల మొక్కలు నాటిన రైతులకు బిల్లుల విషయం తెలిపి అందరికీ బిల్లులు సకాలంలో పడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏపీఓ మంజునాథ్, ఈసీ సుబ్బారెడ్డి, క్షేత్ర, సాంకేతిక సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ పంపిణీ

అమడగూరు: మండల వ్యాప్తంగా జగనన్న ఇళ్ల కింద నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులకు బుధవారం సిమెంట్‌ను పంపిణీ చేశారు. వారం రోజుల క్రితమే సిమెంట్ సరఫరా చేసినా ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున మండల వ్యవసాయ గోదాములో సిమెంట్ నిల్వ చేశారు. హౌసింగ్ ఏఈ భానుప్రకాష్ ఆధ్వర్యంలో పంచాయతీల వారిగా లబ్ధిదారులకు సిమెంట్‌ను పంపిణీ చేశారు. సుమారు 4 వేల బస్తాల సిమెంట్‌ను పంపిణీ చేయగా లబ్ధిదారులంతా సంతోషాన్ని వ్యక్తం చేశారు. నిర్మాణాలు పూర్తి చేసిన వెంటనే బిల్లులు పొందవచ్చని, ఇంకా అర్హులుగా ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

క్షయపై ఆందోళనొద్దు


అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

తాడిమర్రి: క్షయవ్యాధి గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, క్రమం తప్పకుండా మందులు వాడితే నయం అవుతుందని ఎంపీహెచ్‌ఈఓ నారాయణస్వామి గ్రామస్తులకు సూచించారు. మండలంలోని చిల్లవారిపల్లిలో బుధవారం ఎంఎల్‌హెచ్‌పీ సాయికీర్తన అధ్యక్షతన క్షయవ్యాధి (టీబీ) నిర్మూలనపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ వ్యాధిగ్రస్తులు ప్రతి రోజు తాజా ఆకుకూరలు, కూరగాయలు, పాలు, కోడిగుడ్డు, చేపలు, మాంసం తదితర పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. దీంతో శరీరంలో వ్యాధి నిరోధక శక్తి పెరిగి వ్యాధి నివారణ అవుతుందన్నారు. గ్రామంలో 104 వాహన సిబ్బంది వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు తదితరులకు బీపీ, షుగర్ పరీక్షలు చేసి, వైద్య చికిత్సలు అందించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామ్‌కుమార్, ఏఎన్ఎం నందిని, ఆరోగ్య కార్యకర్త రంగనాయకులు, ఆశా కార్యకర్త నరసమ్మ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ధర్మవరం: మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు విన్నవించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు వినతి పత్రం అందించారు. ఈనెల 17న కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టామని సీఐటీయూ అధ్యక్షుడు ఆదినారాయణ, కార్యదర్శి ఆయుబ్‌ఖాన్ తెలిపారు. ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని లేకపోతే ఉద్యమాలు తప్పవన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌పోర్ట్ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు రఫి, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు బాబు, చెన్నకేశవులు, పుల్లన్న తదితర నాయకులు పాల్గొన్నారు.

భక్తుల కోసం సౌకర్యాల కల్పన

కదిరి అర్బన్: యర్రదొడ్డి గంగమ్మ ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందుల్లేకుండా సౌకర్యాలు కల్పించేందుకు ఆలయ ఆవరణాన్ని బుధవారం ఆలయ కమిటీ చైర్మన్ నరసారెడ్డి, ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, ఈఓ రామాంజినేయులు పరిశీలించారు. భక్తుల సౌకర్యార్థం రెండు నీటి ట్యాంకులు, పార్కింగ్ సదుపాయం, కంపచెట్ల తొలగింపు చేపట్టనున్నట్లు తెలిపారు.